# ప్రశ్నలు & సమాధానాలు
# ప్రశ్న 313: మంచితనమా లేక గొప్పతనమా?
# మార్చ్ 30, 2024

ఈ ప్రశ్న-సమాధానాలు ప్రొ. అనిల్ కుమార్ గారి సత్యోపనిషద్, సంపుటం 1, పేజీలు 65-70 నుండి తీసికొనబడినవి

స్వామి! ఈ నాటి ఆధునిక ప్రపంచంలో మనుషులు దేవునికి దగ్గరయ్యారా?

భగవాన్: ఈ నాటి ఆధునిక ప్రపంచం సారహీనంగా, కృత్రిమంగా ఉంటావుంది. పైపైన అందరూ అందరికీ 'హలో', 'హలో' అంటారు. ప్రతి చిన్న దానికి 'థాంక్స్' చెప్తారు. ఇవన్నీ యాంత్రికంగా, పరిపాటిగా, పైపై మర్యాదగా వాడే పదాలు, అంతే. ఎక్కడ చూసినా స్వార్థమే కనిపిస్తుంది.

ఆధునిక శాస్త్రం వల్ల మనిషి చంద్రయానం చేశాడు కానీ పక్కింట్లో అడుగు పెట్టడం మర్చిపోయాడు. చంద్రుడిని చేరుకున్నాడు కానీ తన హృదయంలో ఉన్న రామచంద్రుడిని చూడలేకపోతున్నాడు. ఆధునిక మానవుడు చేప వలె నీటిలో ఈద గలుగుతున్నాడు, పక్షి వలె ఎగర గలుగుతున్నాడు కానీ తన రెండు పాదాలతో ఒక మైలు కూడా నడవలేక పోతున్నాడు. రెండు అంగుళాలుండే తన కంటితో కొన్ని వేల మైళ్ళ దూరంలో ఉండే నక్షత్రవీధిని చూడ గలుగుతున్నాడు కానీ తనను తాను చూసుకోలేక పోతున్నాడు. కన్ను, చెవి పక్క పక్కనే ఉన్నప్పటికీ ఒక దానిని ఒకటి చూడలేవు కదా? భగవంతుడు నీ హృదయమనే క్షీరసాగరంలో శయనించి ఉన్నాడు కానీ ఈనాడు హృదయం ఒక క్షరసాగరంగా మారిపోయింది. కనుక దైవాన్ని ఎలా పొంద గలుగుతాడు?

ఫ్రాన్స్ దేశము ఎంతో సంపన్నమైనప్పటికీ యుద్ధం కోల్పోయింది ఎందుకు? ఆ దేశంలో లక్ష్యం లేక, దుర్గుణములు కలిగి యున్న ఆనాటి యువత వల్ల. ఇటువంటి నడత ఈ నాడు ప్రజలలో ఎక్కువ అవుతూ ఉంది. ఈనాటి మానవుడు ఆశల కొరకు ప్రాకులాడుతూ జీవిస్తున్నాడు కానీ ఆదర్శముల కొరకు పాటుపడాలి. గొప్ప ఆదర్శములు కలిగి ఉన్న వారే ఆధ్యాత్మికంగా ఒకరికొకరు దగ్గర అవుతారు.

స్వామి! జీవితంలో పైకి ఎలా రాగలము?

భగవాన్: కష్టపడాలి. కష్టమైనా సరే కావాలనుకుంటే దొరుకుతుంది. ప్రతి ఒక్కరూ జీవితంలో పైకి రావటానికి ప్రయత్నించాలి. గురి ఎప్పుడూ పైకే ఉండాలి. గురి కిందకి ఉండటం పాపంతో సమానం. ప్రతి ఒక్కరూ ఆదర్శ మార్గంలో పయనించి గమ్యం చేరుకోవాలి. నర జన్మ యొక్క లక్ష్యమే అది. మానవుడు తాను దైవమనే సత్యాన్ని గుర్తించాలి. ఆ దైవత్వమును సాధించాలి. కానీ ఇది అంత సులభము కాదు. తొందరలో కాలు జారడం సులభం.

ఉదాహరణకు, మీరు కొడైకనాల్ రావడానికి బస్సెక్కి వస్తే ఆ బస్సు కొండలెక్కినపుడు చాలా శబ్దము చేస్తుంది. లారీలు కూడా ఈ కొండలెక్కి కొడైకనాల్ వచ్చినపుడు పెద్ద శబ్దాలు చేస్తాయి. కానీ అదే బస్సు, లారీ కిందకి వెళ్ళడానికి ఎంతో సులభం. మానవ జీవితం కూడా అంతే. జీవితంలో పైకి రావడానికి ఎంతో కష్టపడాలి. కానీ పైనుంచి కింద పడి నాశనం అయిపోవడం ఎంతో సులభంగా, వేగంగా జరిగిపోతుంది.

ఇంకొక ఉదాహరణ తీసుకోండి. ఒక బాణం వేయడానికి ఎంత వెనక్కి లాగితే అంత దూరం పోతుంది. అదే విధంగా, ఎక్కువ కష్టపడితే ఫలితము కూడా ఎక్కువగానే లభిస్తుంది. ఒక రాకెట్టును ఎంత శక్తితో పంపిస్తే, అంత దూరం ఆకాశంలోకి ప్రయాణం చేస్తుంది. అదే విధంగా, జీవితంలో కూడా ఎంత ప్రయత్నం చేస్తే అంత ఫలితం దక్కుతుంది.

స్వామి! జీవితంలో గొప్పతనం ఎలా పొందగలమో చెప్పండి?

భగవాన్: ఇటువంటి ఆలోచన మీ తలలోకి ఎప్పటికీ రానీయవద్దు. గొప్పవాడివైతే ఏదో ఘనత, విశిష్టత లభిస్తుందని అనుకోవడం పొరపాటు. అది తప్పు! జీవితంలో గొప్పతనం పొందడం మీ ధ్యేయం కాకూడదు. సమాజంలో ఎందరో గొప్పవారు ఉన్నారు. అది అంత ముఖ్యమనుకోను. గొప్పతనం కంటే మంచితనం ముఖ్యం. గొప్పతనం బదులు మంచితనాన్ని మీ ధ్యేయంగా పెట్టుకోండి. గొప్పవాడి కంటే మంచివాడవటం ముఖ్యం.

ఈ రెండిటి మధ్య భేదం ఏంటి? గొప్పవాడు భగవంతునిలో మానవుని చూస్తాడు, కానీ మంచివాడు మానవునిలో భగవంతుని చూస్తాడు. రామాయణంలో రావణుడు నిస్సందేహంగా గొప్పవాడే. భగవంతుడైన రాముడిసే మానవునిగా తలచాడు. రాముడు ఆదర్శవంతుడు, మంచివాడు. రాముడు పక్షి అయిన జటాయువులో, ఉడతలలో, విభీషణుడు వంటి రాక్షసులలో కూడా దైవత్వాన్ని చూసాడు. శబరి, చదువు రాని గుహుడు, మరి ఋషులందరినీ తన ప్రతిబింబముల వలె తలచాడు రాముడు. అందుచేత రాముడు మంచివాడు. అదే విధంగా మీరు మంచివారిగా పేరు సంపాదించుకోవాలి, గొప్పవారిగా కాదు.

స్వామి! ఆదర్శవంతమైన ప్రభుత్వం అంటే ఎలా ఉంటుంది?

భగవాన్: ఆదర్శవంతమైన ప్రభుత్వంలో అందరూ మనఃపూర్వకంగానే నియమనిబంధనలను పాటిస్తారు. అందరూ వారి వారి బాధ్యతలను నేరవేరుస్తారు. Government కంటే 'Godment' ఇంకా గొప్పది. కానీ ఈనాడు ప్రజలు వారి అర్హతల గురించి పోరాడుతున్నారు కానీ బాధ్యతల గురించి మర్చిపోతున్నారు.

సోమరితనానికి ఏమాత్రం అవకాశం ఇవ్వకూడదు. ఉద్యోగులందరూ నిష్కపటంగా, వారి నెలవారీ జీతాలకు న్యాయం చేకూరునట్లు పని చేయాలి. లేకుంటే వారి తోటి ఉద్యోగులనూ, ప్రభుత్వాన్ని మోసం చేసిన వారవుతారు. ప్రజలు సామరస్యం, సమగ్రత, సమైక్యత, సౌభ్రాత్రత నేర్చుకోవాలి.

ఈ గుడ్డను చూడండి. ఇది ఇంత గట్టిగా ఎందుకుందంటే దీనిలోని దారాలు ఒక దానితో ఇంకొకటి కలిపి నేయబట్టి. కానీ ఆ దారాలను విడదీసేస్తే ఒక వేలుతో కూడా తుంచి వేయవచ్చు. ఐకమత్యంలోనే ఏకత్వమున్నదని అందరూ తెలుసుకోవాలి. నీ ఊతకోలను ఊపుకుంటూ నడుచుకోవచ్చు కానీ వేరే వారికి తగలకుండా, వారి స్వేచ్ఛకి అడ్డం రాకుండా నడవ గలగాలి. మూలసిద్ధాంతములను అందరూ పాటించాలి. వ్యక్తి కంటే సమాజం, సంఘం ముఖ్యం. సమాజానికి ఉపయోగకరమైన వాటి గురించి నేర్చుకోవడం ఉత్తమం. మీరు చదివిన చదువు సమాజానికి ఉపయోగ పడాలి.

స్వామి! మాకు ప్రస్తుతం ఏది ముఖ్యమో తెలియచేయండి.

భగవాన్: మీకు ప్రేమ ఉంటే అది చాలు. మిగతావన్నీ అవే వస్తాయి. సేవ, త్యాగం, వినయం, భక్తి, క్రమశిక్షణ, ఇటువంటివన్నీ ప్రేమలోనే ఇమిడి ఉన్నాయి. ప్రేమ మాత్రమే అన్ని సద్గుణములను పెంపొందింప చేస్తుంది. ప్రేమ ఉన్న చోట అహంకారం, ద్వేషం, ఈర్ష్య వంటి పశు లక్షణాలు ఉండవు.

ప్యారిస్ లో ఒక ఆమె తనకున్న కొంచెం డబ్బుతో జాగ్రత్తగా బ్రతికేది. ఒక రోజు ఆమెకు కొంతమంది బీదవారు రోడ్డు పక్కన చలిలో వణుకుతూ కనబడ్డారు. ఆమెకు ఎంతో జాలి వేసింది. రోజు కొన్ని కంబళీలను తీసుకొని వెళ్ళి ఆ పేదవారికి ఇచ్చేది. కొందరు పెద్దలు గమనించి, తుదకు ప్రభుత్వానికి కూడా తెలిసింది. వారు ఆమెకు సన్మానం చేయుటకు నిర్ణయించుకున్నారు. ఆమెను అభినందించుటకు కొంతమంది యువత వచ్చారు. తాను బీదగా ఉన్నవారందరికీ సహాయం చేయలేక పోతున్నందుకు బాధపడింది. తాను చేయగల సహాయము అందరికీ సరిపోవడం లేక పోతున్నందుకు నిస్సహాయంగా భావించింది.

మీకు ఇంకొక కథ చెప్తాను. ఆర్మీలో ఒక సైనికుడు యుద్ధంలో తన రెండు కాళ్ళు కోల్పోయి ఊతకర్ర ఆధారంతో నడిచేవాడు. అతను ఎక్కువ కాలం ఆర్మీలో పని చేయనందు వలన అతనికి పింఛను కూడా ఎక్కువ రాదు. అతని విభాగానికి మేజరు కొంత డబ్బు ఇచ్చి పంపించేశాడు. ఆ సైనికుడు ఇంటికెళ్ళే దారిలో వర్షం పడడం మొదలయ్యేడప్పటికి ఒక గ్రామంలోని చౌల్ట్రీలో ఆగాడు. తన దగ్గిర ఉన్న డబ్బులు కూడా అయిపోయాయి. మరుసటి రోజు స్కూలుకి వెళ్ళే ఒక అమ్మాయి అతనిని అవస్థ చూసి అతని గురించి అడిగింది. అతని దుస్థితి చూసి చాల బాధపడింది. అప్పటి నుండి రోజు స్కూలుకి ఒక గంట ముందే బయలుదేరి, దారిలో కొన్ని పండ్లు కోసి, వాటిని అమ్మి, ఆ డబ్బుతో చపాతీలు కొని ఆ సైనికునికి ఇచ్చేది.

ఒక రెండు వారాల తర్వాత ఆ మేజరు అటు వైపు వెళ్తుండగా ఆ సైనికుని చూసి ఆశ్చర్యపడ్డాడు, ఇన్ని రోజుల తర్వాత కూడా ఇంకా ఇంటికి చేరలేదా అని. ఇంతలో ఆ అమ్మాయి వచ్చి సైనికునికి చపాతీలు ఇచ్చింది. ఆ మేజరు ఆమెను అనుసరించాడు. అతనిని చూసి వారి కూతురు ఏమైనా తప్పు పని చేసిందేమో అని ఆమె తల్లిదండ్రులు భయపడ్డారు. ఆ అమ్మాయిని మందలించేలోగా ఆ మేజరు అడ్డం పడి వారితో చెప్పాడు, “మీరు చాల అదృష్టవంతులు. మనలో ఎంత మందికి ఇంత దాతృత్వం, ప్రేమ, త్యాగబుద్ధి, సేవ చేసే హృదయం ఉండే పిల్లలు కలరు?” వారికి కొన్ని బంగారపు నాణెములను ఇవ్వబోతే వారు చెప్పారు, “సర్, మాకు ఇవంతా అవసరం లేదు. మేము కష్టపడి పని చేసిన డబ్బుతో మేము బ్రతక గలము. ఈ బంగారాన్ని మేమెక్కడ కాపాడ గలుగుతాము? మమ్మల్ని వదిలేయండి, సర్.” ఆ మేజరు ఆనందపడి అతని ఊరు వెళ్ళినప్పుడు తగ్గ వరుని చూసి ఆ అమ్మాయికి పెండ్లి జరిపించాడు. ఇదే ప్రేమ అనే నిజమైన సంపద. ప్రేమ పెంపొందించేదే జీవితం. ప్రేమని కుచించేది చావు.

వచ్చే వారం మరి కొన్ని మధుర రత్నాలతో స్వామి మన హృదయాలను నింపుతారు! సాయి రామ్!